సాక్షి
నిజామాబాద్
శనివారం । 16 । మార్చి । 2024



వేగంగా పన్ను వసూళ్లు

జిల్లాలో ఇంటి పన్ను వసూళ్లలో ఉద్యోగులు వేగం పెంచారు. ఇప్పటికే రూ. 20.57 కోట్లు వసూలు చేశారు.

- 8లో ▸



గరిష్ఠం/కనిష్ఠం
37.0 /22.4

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గురుకులాల్లో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024–2025 విద్యా సంవత్సరానికిగాను 6 నుంచి 9వ తరగతుల వరకు మిగిలిన సీట్ల భర్తీకి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమన్వయ అధికారిణి సంగీత, సుద్దపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గోదావరి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. అభ్యర్థులు www.trwreir.ac.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఏప్రిల్ 21న బీఎల్‌వీసెట్ –2024 ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని వారు తెలిపారు.

నాణ్యమైన విద్యకు ప్రణాళికలు



ఎడపల్లి(బోధన్): గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రతియేటా కొత్త ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు రాష్ట్ర గురుకుల పాఠశాలల కార్యదర్శి రమణ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఎడపల్లి బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రై సొసైటీ పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, లైబ్రరీలు, సైన్స్ ల్యాబ్‌ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఎడపల్లి గురుకులంలో రూ. కోటిన్నర వ్యయంతో నిర్మాణాలు జరిగాయన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పాఠశాలలోని కిచెన్ గార్డెన్ బాగుందని.. దీనిని తీర్చిదిద్దేందుకు కృషి చేసిన ఉపాధ్యాయుడు రవిని సన్మానించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ సుహాసిని రెడ్డి ఉన్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీలతో పాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సుదర్శన్‌రెడ్డి కలెక్టర్ కార్యాలయంలో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే జూలై వరకు తాగునీటి సమస్య తలెత్తకుండా పక్కాగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. నీటిఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న బలహీనవర్గాల కాలనీల్లో ఒక గంట అదనంగా నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల భర్తీలో అవకతవకలు

- నాన్‌లోకల్ అభ్యర్థులకు కౌన్సెలింగ్
- రాత్రి సమయంలో నిర్వహించడంపై అనుమానాలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా వైద్యారోగ్యశాఖలో ఇటీవల నిర్వహించిన ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల భర్తీలో అవకతవకలు జరిగినట్లు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. గతంలో జరిగిన ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల్లో అవకతవకలపై కలెక్టర్ సీరియస్ స్పందించిన విషయం తెలిసిందే. కాగా ఇటీవల నోటిఫికేషన్‌లో 43 పోస్టులకు 105మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇట్టి పోస్టుల్లో నిబంధనల ప్రకారం లోకల్ అభ్యర్థులకు ప్రాధాన్యత, అటు తర్వాతా బాసర జోన్ వారికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఇతర జోన్‌లు, జిల్లాల వారిని కౌన్సిలింగ్‌కు పిలవడంపై అనుమానాలకు తావిస్తుంది.

లోకల్ అభ్యర్థులకు అన్యాయం..

నిబంధనల ప్రకారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కౌన్సిలింగ్ నిర్వహించాలి. కానీ గురువారం రాత్రి 7గంటల తర్వాత కూడా ఎంఎల్‌ఎహెచ్‌పీ పోస్టులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. లోకల్ అభ్యర్థులు సుమారు 60మంది దరఖాస్తులు చేసుకోగా, దరఖాస్తు చేసిన సమయంలో సర్టిఫికేట్లు వెరిఫికేషన్ చేశారు. మళ్లీ ఇప్పుడు సర్టిఫికేట్లు లేవని కొర్రిలు పెట్టి తిరస్కరించారని ఆవేదన చెందుతున్నారు. నాన్‌లోకల్ కింద ఇతర జిల్లాలతోపాటు ఆంధ్రకు చెందిన వారికి సైతం కౌన్సిలింగ్ నిర్వహించడపై లోకల్ అభ్యర్థులు మండిపడుతున్నారు. అన్ని అర్హతలు ఉన్నా, కావాలనే నాన్ లోకల్ అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారని లోకల్ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈవిషయమై జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సుదర్శన్‌కు ఫోన్ చేయగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

కవిత అరెస్టు కలకలం



ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు కావడం జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. కవితను ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ చట్టం కింద అరెస్టు చేసినట్లు ఈడీ ప్రకటించింది. బీఆర్‌ఎస్ రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత పార్టీ శ్రేణుల్లో ఇప్పటికే నిర్వేదం అలుముకుంది. ఇదిలా ఉండగా లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చే ముందే కవిత అరెస్టు ఘటన బీఆర్‌ఎస్ వర్గాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

- 2023 మార్చి 8, సెప్టెంబర్ 14న ఢిల్లీ లిక్కర్ స్కాంపై ఈడీ నోటీసులు
- తాజాగా నోటీసులతో పాటు అరెస్టు చేసిన ఈడీ
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ
- నేడు అన్ని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ నిరసనలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అధికారులు శుక్రవారం అరెస్టు చేయడం జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ వర్గాల్లో కలకలం సృష్టించింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కవిత అరెస్టు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు తెరలేపింది. లిక్కర్ కుంభకోణానికి సంబంధించి ఈడీ 2023 మార్చి 8న మొదటిసారి నోటీసులు జారీ చేసింది. తరువాత 2023 సెప్టెంబర్ 14న మరోసారి నోటీసులు ఇచ్చింది. తాజాగా ఇప్పుడు నోటీసులు ఇవ్వడంతో పాటు ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ చట్టం కింద అరెస్టు చేస్తున్నట్లు ఈడీ అధికారులు ప్రకటన చేయడంతో జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చే కేవలం కొన్ని గంటల ముందే కవిత అరెస్టు ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. శనివారం అన్ని నియోజకవర్గాల్లో కవిత అరెస్టుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేయాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నాయకుడు హరీశ్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గత శాసనసభ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయిన బీఆర్‌ఎస్ వెంటనే లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో కవిత అరెస్టు వ్యవహారం బీఆర్‌ఎస్ వర్గాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోందని చెప్పవచ్చు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఢీకొట్టాల్సిన పరిస్థితుల్లో తాజా అరెస్టు కలకలం కలిగిస్తోంది.

■ బీఆర్‌ఎస్ రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత పార్టీ శ్రేణుల్లో ఇప్పటికే నిర్వేదం అలుముకుంది. హైదరాబాద్‌లో జిల్లా పార్టీకి సంబంధించి సమీక్ష నిర్వహించిన సమయంలో గత పార్లమెంట్ ఎన్నికల్లో కవిత ఓటమి గురించి సైతం కార్యకర్తలు ప్రస్తావించారు. కవిత ఓడిపోయిన సమయంలో ఇలాంటి సమీక్ష సమావేశాలు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. కవిత ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల బరిలోకి రాలేదు.

జరుగబోయే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను కేసీఆర్ ప్రకటించారు. ఇన్ని పరిణామాల నేపథ్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఆశన్నగారి జీవన్‌రెడ్డి జిల్లాలోకి రాకుండా పత్తా లేకుండా వెళ్లినట్లు కార్యకర్తలు బహిరంగంగా అంటున్నారు. కేవలం మూడు సార్లు మాత్రమే జీవన్‌రెడ్డి నామమాత్రంగా జిల్లాకు అదీ ఆర్మూర్‌కు వచ్చి వెళ్లినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

రాజకీయ కక్షతోనే అరెస్టు



ఎమ్మెల్సీ కవిత అరెస్టు చట్ట విరుద్ధం. ఇది పూర్తిగా రాజకీయ కుట్రలో భాగం. ఆమె అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం. సుప్రీం కోర్టులో అరెస్టు చేయబోమని చెప్పి, కేసు పెండింగ్‌లో ఉండగానే అదుపులోకి తీసుకోవడం సరికాదు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ఈడీని పంపి కేంద్ర ప్రభుత్వం కావాలనే అరెస్టు చేయించింది. బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మక్కయ్యాయి. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులే దొరకని స్థితిలో బీజేపీ, కాంగ్రెస్‌లు అయోమయంలో ఉన్నాయి. బీఆర్‌ఎస్‌ను చీల్చుతూ అభ్యర్థులను రెండు పార్టీలు కూడబలుక్కుని మాయం చేస్తున్నాయి. రాజకీయ కుట్రలను తిప్పికొడతాం. ఎమ్మెల్సీ కవితకు తెలంగాణ సమాజం అండగా నిలుస్తుంది.

– బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే

చట్టం తన పని తాను చేస్తోంది



భారత ప్రజాస్వామ్యంలో చట్టం తన పని తాను చేసుకుంటూ వెళుతుంది. కేసీఆర్ కుమార్తె కవిత లాంటివాళ్లు సమాజానికి చీడపురుగులు. ఇలాంటి వ్యక్తులు అభివృద్ధికి ప్రధాన అడ్డంకి. కల్వకుంట్ల కుటుంబం చేసిన అవినీతి కారణంగా తెలంగాణ రెండు దశాబ్దాల వెనక్కు వెళ్లింది. కవితలాంటి వాళ్ల విషయంలో ఎంత తొందరగా నేరారోపణ రుజువు చేస్తే అంత మంచిది. దోషిగా తేలాక తక్షణమే శిక్ష ఖరారు చేసి రాజకీయాల నుంచి బయటకు పంపితేనే సమాజానికి ఉపయోగం కలుగుతుంది. కవిత లిక్కర్ కుంభకోణానికి పాల్పడడంతో తెలంగాణ సమాజం తలదించుకునే పరిస్థితి ఏర్పడింది. చట్టం పని చట్టం చేసుకుంటూ వెళ్లడాన్ని ఆహ్వానించాలి.

– ధర్మపురి అర్వింద్, ఎంపీ

గోదారి తీరాన వైల్డ్‌లైఫ్..



బ్యాక్ వాటర్ వద్ద ఫారెస్టు సిబ్బంది



మాట్లాడుతున్న ఆర్మూర్ ఎఫ్‌డీవో

- ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ వద్ద అటవీ ఉద్యోగులకు శిక్షణ
- వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించిన అధికారులు
- ఎకో టూరిజం ఏర్పాటైతే ఈ ప్రాంతం అభివృద్ధి

డొంకేశ్వర్(ఆర్మూర్): వైల్డ్ లైఫ్ అనగానే డొంకేశ్వర్ మండలంలోని నడ్కుడ, చిన్నయానం వద్ద ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ గుర్తొస్తుందని, ఇలాంటి ప్రకృతి జిల్లాలో ఎక్కడా లేదని జిల్లా ఫారెస్టు అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో పని చేస్తున్న బీట్ ఆఫీసర్లు, సెక్షన్ అధికారులు, సిబ్బందికి శుక్రవారం వన్య ప్రాణుల సంరక్షణపై ఆర్మూర్ ఎఫ్‌డీవో భవానీ శంకర్, ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌లు శిక్షణ ఇస్తూ అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ రిజర్వాయర్‌లో నీళ్లు వెనక్కి వెళ్లినప్పుడు జింకలు, పక్షులు స్వేచ్ఛగా విహరిస్తాయన్నారు. వర్షాకాలంలో నీళ్లు నిండుగా ఉండడంతో ఆహారం దొరక్క పొలాల వద్దకు వస్తున్న జింకలను వీధి కుక్కలు వేటాడి చంపుతున్నాయన్నారు. వీటి రక్షణకు అటవీ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వన్య ప్రాణుల రక్షణకు వీధి కుక్కలను కట్టడి చేయడం ఏకైక మార్గమన్నారు. అటవీ జంతువులకు ప్రాణహాని ఉందని సమాచారం అందిన తక్షణమే సిబ్బంది స్పందించాలన్నారు. చిన్నయానం, నడ్కుడ వద్ద ఎకో టూరిజం త్వరగా ఏర్పాటైతే ఇక్కడి ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. స్థానికులకు కూడా ఉపాధి లభిస్తుందన్నారు. ఈ ప్రాంతానికి ప్రస్తుతం బీట్ ఆఫీసర్, వాచ్ టవర్, ఇతర సిబ్బంది ఏర్పాటు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎఫ్‌డీవో నుంచి బీట్ ఆఫీసర్ వరకు మొత్తం 120 మంది ఉద్యోగులు అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై శిక్షణ నిమిత్తం గోదావరి తీరానికి వచ్చారు. సూర్యోదయానికి ముందే వచ్చిన ఫారెస్టు అధికారులు జీజీ నడ్కుడ, చిన్నయానం, గాదేపల్లి బ్యాక్ వాటర్ వద్ద పచ్చదనంతో పరుచుకున్న ప్రకృతి అందాలను తిలకించారు. నీటిలో నుంచి అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడు, ఆ సూర్యోదయం వేళ సందడి చేస్తు న్న జింకలు, పక్షులు అటవీ అధికారులను కట్టి పడేశాయి. పచ్చని గడ్డిలో అక్కడక్కడా ఉన్న నీటి కొలనుల వద్ద, నదీ ఒడ్లపై సెల్‌ఫోన్లలో సరదాగా ఫొటోలు, సెల్ఫీలు దిగారు. శిక్షణా కార్యక్రమంలో ఎఫ్ఆర్వోలు పద్మారావు, రవీందర్, వినయ్‌కుమార్, రవిమోహన్ భట్ పాల్గొన్నారు.



నర్సరీలను నిర్లక్ష్యం చేయకండి

- ఎంపీడీవోలకు స్పష్టం చేసిన అదనపు కలెక్టర్
- 'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్..

డొంకేశ్వర్(ఆర్మూర్): హరితహారం కోసం మొక్కలను సిద్ధం చేస్తున్న నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం చేయవద్దని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. ఈ నెల 15న 'సాక్షి' దినపత్రికలో వచ్చిన 'నర్సరీల నిర్వహణ గాలికి' అనే కథనంపై ఆయన స్పందించారు. ఇందుకు జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ఉన్న నర్సరీలను పరిశీలించాలని, షేడ్‌నెట్లు ఏర్పాటు చేసి మొక్కలు ఎండిపోకుండా చూడాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్‌తో పాటు ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పలు మండలాల ఎంపీడీవోలు నర్సరీలను తనిఖీ చేశారు. ఇటు డొంకేశ్వర్ మండలంలోని కోమట్‌పల్లి, నికాల్‌పూర్ గ్రామాల్లోని నర్సరీలను ఎంపీడీవో శ్రీనివాస్ రావు, ఏపీవో సవిత పరిశీలించారు. పాలిథిన్ బ్యాగుల్లో మొలకలు రాకపోతే మళ్లీ విత్తనాలు వేయాలని, క్రమం తప్పకుండా నీటిని అందించి మొక్కలను సంరక్షించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మొక్కల ఎదుగుదలకు జీవామృతం తప్పకుండా వాడాలన్నారు. గ్రామ పంచాయతీ నిధుల నుంచి షేడ్ నెట్లు కొనుగోలు చేసి ఏర్పాటు చేయాలని సూచించారు. నర్సరీలపై నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని ఎంపీడీవో స్పష్టం చేశారు.



కోమట్‌పల్లి నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఆన్‌లైన్‌లో టెన్త్ హాల్ టికెట్లు

నిజామాబాద్ అర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు అందుబాటులో ఉన్నాయని.. డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈవో దుర్గాప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటన తెలిపారు. హాల్ టికెట్లపై ప్రధాన ఉపాధ్యాయుడి సంతకం లేకున్నా పర్వాలేదని పేర్కొన్నారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్‌తో పరీక్ష హాల్‌లోకి అనుమతించడం జరుగుతుందన్నారు. కేంద్రంలోకి సెల్‌ఫోన్లు అనుమతించబోరని పేర్కొన్నారు. ఏవైనా సందేహాలుంటే 9030282993 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

గోప్యత వెనుక మతలబేమిటి..!

- రెండు రోజులుగా ఎస్సారెస్పీ నీటిమట్టం వెల్లడించని అధికారులు
- ఫోన్‌లో సంప్రదించినా స్పందించని అధికారులు
- కింది వరకు నీరందడం లేదని ఆయకట్టు రైతుల ఆందోళన



నీరు లేక వెలవెలబోతున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటి విడుదల, నీటి మట్టం వివరాలను గోప్యంగా ఉంచడం వెనుక మతలబమేమిటని ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రాజెక్ట్ నీటిమట్టం, నీటి విడుదల వివరాలను ప్రతిరోజూ వెల్లడించే అధికారులు రెండు రోజులు నుంచి ఇవ్వడం లేదు. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన రేకెత్తుతోంది. ప్రస్తుతం యాసంగిలో ప్రాజెక్ట్ నీళ్లు పంట చివరి వరకు అందుతాయ లేదా అనే అనుమానాలు రైతులు వ్యక్తం చేస్తున్నారు.

12 టీఎంసీల నీటి నిల్వ..

ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 20 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. వచ్చే ఖరీఫ్ ప్రారంభం నాటికి కచ్చితంగా 12 టీఎంసీల నీటిని నిల్వ ఉంచాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. లెక్క ప్రకారం 15 టీఎంసీల నీటినిల్వ ఉండాలి. కానీ అదనంగా మరో మూడు టీఎంసీలను కూడా పంటలకు అందించేందుకు నిర్ణయించారు. ప్రాజెక్ట్ అధికారుల ప్రణాళిక ప్రకారం ఈ నెలాఖరు వరకు నీటి సరఫరా చేపట్టాలి. అదనంగా మూడు టీఎంసీలు ఇవ్వాలనుకున్నా.. చివరి వరకు పంటలకు నీరందుతుందో లేదోననే ఆందోళన తప్పడం లేదు.

గజిబిజి.. వారబందీ..

ప్రాజెక్ట్ నుంచి యాసంగి సీజన్‌లో కాల్వల ద్వారా వారబందీ ప్రకారం నీటి విడుదల చేపడతారు. గతంలో వారబందీ అంటే 10 రోజులు కాల్వల ద్వారా నీటిని విడుదల చేసి.. 5 రోజులు నిలిపివేసేవారు. నెలలో రెండు తడుల నీరు అందేది. కానీ ప్రస్తుత ఏడాది వారబందీ గజిబిజిగా మారింది. కాకతీయ కాలువను రెండు జోన్‌లుగా విభజించారు. డి–56 వరకు మొదటి జోన్‌కు 8 రోజులు 3500 క్యూసెక్కులు, డి–56 నుంచి ఎల్‌ఎండీ వరకు జోన్–2కు ఏడు రోజులు 5,500 క్యూసెక్కుల నీటి విడుదల చేపట్టాలని నిర్ణయించారు. ఈ లెక్క ప్రకారం ప్రతిరోజూ కాలువ ద్వారా నీరు విడుదల అవుతుంది. కానీ జోన్–2కు నీటి సరఫరా జరుగుతున్నప్పుడు జోన్–1లోని ఉప కాల్వలను మూసి ఉంచాలి. కానీ ప్రస్తుతం అలా జరగడం లేదు. నీరందడం లేదని జోన్–1 ఉప కాల్వలను కూడా తెరుస్తున్నారు. అయినా కింది వరకు నీరందడం లేదు. దీంతో ప్రాజెక్ట్ అధికారులు కాకతీయ కాలువ ద్వారా 7,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. అయినప్పటికీ కింది వర కు నీళ్లు రావడంలేదని రైతులు ఆందోళనలు చేస్తున్నారు. ప్రాజెక్ట్ అధికారులు నీటి లెక్కలను ప్రతి రోజూ ఇచ్చి రైతుల్లో ఆందోళన పెరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

మాజీ డీసీవో అక్రమాలపై విచారణ

- రికార్డులు ఎందుకు సమర్పించలేదని సింహాచలంపై విచారణాధికారి ఆగ్రహం
- లిఖిత పూర్వక వాంగ్మూలం స్వీకరణ
- 'సాక్షి' కథనాలకు స్పందన

నిజామాబాద్‌అర్బన్: మాజీ జిల్లా సహకార అధికారి సింహాచలం అక్రమాలపై శుక్రవారం రిజిస్ట్రార్ ఆఫ్ కో–ఆపరేటివ్ సొసైటీ కమిషనరేట్ అడిషనల్ రిజిస్ట్రార్ ప్రసన్న శుక్రవారం విచారణ చేపట్టారు. సింహాచలం అవినీతి అక్రమాలపై 'సాక్షి'లో ఇటీవల పలు కథనాలు ప్రచురితమైన విషయం విదితమే. దీంతో స్పందించిన కమిషరేట్ విచారణకు ఆదేశించింది.

అడిషనల్ రిజిస్ట్రార్ ప్రసన్నను విచారణాధికారిగా నియమించగా.. ఆమె సొసైటీ చైర్మన్లు, సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా లోతుగా విచారణ చేశారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సుదీర్ఘంగా విచారణ జరిగింది. ఒక్కొక్కరిని విచారిస్తూ వారి నుంచి లిఖిత పూర్వకంగా వాంగ్మూలాలను తీసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఉద్యోగులతో పాటు సొసై టీల్లోని కార్యదర్శులు విచారణకు హాజరయ్యారు.

రెండు రోజుల్లో రికార్డులివ్వాలి

ఎంక్వైయిరీకి మాజీ డీసీవో సింహాచలం కూడా హాజరయ్యారు. అయితే విచారణకు ముందు రికార్డులు ఎందుకు సమర్పించలేదని.. ప్రస్తుతం ఎంక్వైయిరీకి కూడా రికార్డులు లేకుండా ఎలా వచ్చారని అడిషనల్ రిజిస్ట్రార్ మండిపడ్డారు. దీంతో ఆయన రికార్డులు సమర్పించడానికి వారం రోజులు గడువు కావాలని కోరగా.. రెండు రోజుల్లో సమర్పించకపోతే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించినట్లు సమాచారం. అలాగే 'నీ హయాంలో అసలేం జరిగిందో వాస్తవాలను లిఖిత పూర్వకంగా రాసివ్వాలని, తప్పుడు సమాచారం ఇస్తే సీరియస్‌గా స్పందించాల్సి ఉంటుందని' మాజీ డీసీవోను విచారణాధికారిణి హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో తన హయంలో జరిగిన వాటిని సింహాచలం లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చినట్లు తెలిసింది.

అవినీతిపై ఫిర్యాదులు

విచారాణాధికారిణి మరికొందరిని విచారించగా.. జిల్లాలోని ధాన్యం కొనుగోళ్లు, సొసైటీలో అక్రమాలకు సంబంధించి మాజీ డీసీవో అవినీతికి పాల్పడినట్లు కొందరు అధికారులు, సొసైటీ చైర్మన్లు లిఖిత పూర్వకంగా సమర్పించారు. మాక్లూర్‌లో జరిగిన అవినీతి, ఎత్తొండ, తాళ్లరాంపూర్‌లో జరిగిన అక్రమాలను ఆధారాలతో స్వాహా లిఖిత పూర్వకంగా అందజేశారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన చెక్కులు ఇచ్చేందుకు కమీషన్లు తీసుకోవడం.. బినామీ పేర్లతో రుణాలు తీసుకొని చెల్లించకపోవడం.. సొసైటీల్లో వివిధ కొనుగోళ్లకు సంబంధించి తప్పులు బిల్లులు సమర్పించి కమీషన్లు పొందినట్లు కొందరు సొసైటీల కార్యదర్శులు, అధికారులు రాసిచ్చారు. జక్రాన్‌పల్లి మండలం పడగల్ సొసైటీలో 773 వరిధాన్యం సంచులు అమ్మగా అందులో 32 క్వింటాళ్ల 20 కిలోల వరి తరుగు తీశారన్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే.. ఆయనకు సింహాచలం తప్పుడు సమాచారం ఇచ్చారని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా సంబంధిత రైస్‌మిల్ నుంచి రూ. 30వేలు ఇప్పించగా, ఇంకా రూ. 35వేలు ఇవ్వాల్సి ఉండగా అడిగితే ఇవ్వడం లేదని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎస్సైల బదిలీ


ఖలీల్‌వాడి: జిల్లాలో శుక్రవారం ఎస్సైల బదిలీలు జరిగాయి. ఈ మేరకు బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను సీపీ కల్మేశ్వర్ జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
ఈ.సాయన్న	ఆదిలాబాద్ ఒకటో టౌన్	రెంజల్
మహ్మద్ షరీఫ్	భైంసా	ఒకటో టౌన్ ఎస్హెచ్-2
డి.రమేశ్	సీఎస్‌బీ, నిజామాబాద్	ఆరోటౌన్
జి.అప్పారావు	ఐదో టౌన్	రుద్రూర్
అశోక్	రెండో టౌన్	ఐదో టౌన్
రాము	సీసీఎస్	రెండో టౌన్
విక్రమ్	ఎడపల్లి	ధర్పల్లి
వంశీకృష్ణ	ధర్పల్లి	ఎడపల్లి
కె.పాండేరావు	వీఆర్	ఐదోటౌన్ ఎస్హెచ్-2
సంతోష్‌రెడ్డి	నిర్మల్	సీసీఎస్ నిజామాబాద్
పి.సాయన్న	ఉట్నూర్ పీఎస్-2	సీఎస్‌బీ నిజామాబాద్
సక్రియా నాయక్	సీఎస్‌బీ, నిజామాబాద్	డీఎస్‌బీ, నిర్మల్
కె.శివాజీ	సీఎస్‌బీ, నిజామాబాద్	సీసీఎస్, నిర్మల్
కె.విఠల్	సీఎస్‌బీ, నిజామాబాద్	డీఎస్‌బీ, నిర్మల్
ఎస్.సాయన్న	ఆదిలాబాద్, ట్రాఫిక్	సీఎస్‌బీ, నిజామాబాద్
ఎండీ నజీబ్	పీసీఆర్, నిజామాబాద్	డీఎస్‌బీ ఆదిలాబాద్

కాగా ఇందల్వాయి ఎస్సైగా ఉన్న ఎస్.మహేశ్ సస్పెండ్ కావడంతో.. డిచ్‌పల్లి ఎస్సై మనోజ్‌కుమార్‌ను ఇందల్వాయికి బదిలీ చేశారు.

క్లుప్తంగా

గాలికుంటు టీకాలు వేయించాలి




రుద్రూర్‌: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి జగన్నాథ చారి అన్నారు. రుద్రూర్‌ మండలం బొప్పాపూర్‌, కోటగిరి మండలం యాద్గార్‌పూర్‌లో గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జెడ్పీటీసీ నరోజి గంగారాం, వెటర్నరీ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ బస్వారెడ్డి, బాలిక్‌ అహ్మద్‌, మండల పశువైద్యాధికారులు సంతోష్‌ రెడ్డి, సురేశ్‌కుమార్‌ పాల్గొన్నారు.

ఆర్థిక సాధికారత సాధించాలి

ఆర్మూర్‌టౌన్‌: మహిళలు అన్ని రంగాల్లో రాణించి స్వయం శక్తితో ఆర్థిక సాధికారత సాధించాలని తెలంగాణ యూనివర్సిటీ ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్‌ రవీందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఐక్యూఏసీ సంస్థ ఆర్థిక సహాయంతో నారిశక్తి ఉమెన్‌ ఎంపవర్‌మెంట్‌ అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాప్‌ నిర్వహించారు. ఆర్‌సీవో అలివేలు, ప్రొఫెసర్లు సరస్వతి, సమత, లక్ష్మణ చక్రవర్తి, సుజాత, శమంత, శరణ్య, సుహాసిని, ప్రిన్సిపాల్‌ ధనవేణి పాల్గొన్నారు.

నిజామాబాద్‌లోనే జాతీయ పసుపు బోర్డు



కమ్మర్‌పల్లి: జాతీయ పసుపు బోర్డు కార్యాలయం నిజామాబాద్‌లోనే ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీ ధర్మపురి అర్వింద్‌ స్పష్టం చేశారు. శుక్రవారం కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పసుపు పంటకు మద్దతు ధర లభిస్తోందని పేర్కొన్నారు. పసుపు ధర మార్కెట్‌లో భారీగా పెరుగుతుండడంపై రైతులు సంతోషం వ్యక్తం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లికార్జున్‌ రెడ్డి, నాయకులు మోహన్‌ రెడ్డి, సంజీవ్‌ పాల్గొన్నారు.

భానుడి భగభగ

జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. వేసవి ప్రారంభంలోనే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. దీంతో ప్రజలు అల్లాడుతున్నారు. జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల వరకు నమోదు అవుతున్నాయి. దీంతో పగలు ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం పూట బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. అత్యవసరంగా వెళ్లాల్సి వస్తే గొడుగులు పట్టుకొని, మాస్కులు, స్కార్ఫ్‌లు పెట్టుకొని వెళ్తున్నారు. – సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌



బోసిపోతున్న పూలాంగ్‌ చౌరస్తా



మోపాల్‌ సొసైటీ చైర్మన్‌గా గంగారెడ్డి ఎన్నిక

మోపాల్‌: మోపాల్‌ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) చైర్మన్‌గా ముల్లంగి గ్రామానికి చెందిన గ్యానాజి గంగారెడ్డి శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు ఎన్నికల అధికారి, అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ మురళి గంగారెడ్డికి నియామక పత్రం అందజేశారు. సొసైటీ చైర్మన్‌ పదవికి ఉమాపతిరావు రాజీనామా చేయడంతో చైర్మన్‌ ఎన్నిక అనివార్యమైంది. 11 మంది డైరెక్టర్ల మద్దతుతో గ్యానాజి గంగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సింగిల్‌ నామినేషన్‌..

మోపాల్‌ చైర్మన్‌ పదవికి శుక్రవారం ఎన్నిక నిర్వహించారు. తొలుత 9 మంది డైరెక్టర్లతో కలిసి పదవిని ఆశిస్తున్న గ్యానాజి గంగారెడ్డి నామినేషన్‌ కేంద్రానికి చేరుకున్నారు. ఆయన ఒక్కరే నామినేషన్‌ దాఖలు చేశారు. గంగారెడ్డిని డైరెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, నరేందర్‌ ప్రతిపాదించారు. అనంతరం నామినేషన్ల స్క్రూటినీ చేశారు. నిబంధనల ప్రకారం మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఎన్నికల అధికారి మురళి గంగారెడ్డి ఎన్నిక ఏకగ్రీవమని ప్రకటించారు. ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. గంగారెడ్డి ఎన్నికతో మండల కేంద్రంలో కాంగ్రెస్‌ నాయకులు సంబురాలు చేసుకున్నారు. గంగారెడ్డికి పీసీసీ ప్రధానకార్యదర్శి కాట్‌పల్లి నగేష్‌ రెడ్డి, మండలాధ్యక్షుడు ఎల్లోల సాయిరెడ్డి, పోలసాని శ్రీనివాస్‌, రాంచంద్ర గౌడ్‌, నాయకులు



గంగారెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి మురళి


గంగాప్రసాద్‌, ప్రతాప్‌సింగ్‌ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. వైస్‌ చైర్మన్‌ సుమన్‌రెడ్డి, డైరెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, అంగల లక్ష్మీ, గంగమణి పాల్గొన్నారు.

సొసైటీ బలోపేతానికి కృషి

డైరెక్టర్లు, రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సహకారంతో సొసైటీ బలోపేతానికి కృషి చేస్తాను. నా ఎన్నికకు సహకరించిన డైరెక్టర్లు, రూరల్‌ ఎమ్మెల్యే, మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ నగేష్‌రెడ్డికి ధన్యవాదాలు. రాబోయే ధాన్యం సీజన్‌లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతాం.

– గంగారెడ్డి, చైర్మన్‌

ఆటో డ్రైవర్‌ స్వామి కుటుంబానికి పరామర్శ




నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్‌లోని ఖిల్లా కెనాల్‌ ప్రాంతంలో బుధవారం ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్‌ స్వామి కుటుంబాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా పరామర్శించారు. స్వామి, ఆయన భార్య దేవాలక్ష్మి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. గణేశ్‌గుప్తా మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటోడ్రైవర్‌ స్వామి పోషణ భారమై ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. స్వామి కుటుంబానికి రూ.15 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. మహాలక్ష్మి పథకంతో నష్టపోతున్న ఆటోడ్రైవర్లను ఆదుకోవాలన్నారు.

వేగంగా పన్ను వసూళ్లు

- జిల్లాలో లక్ష్యం రూ.26.79 కోట్లు
- ఇప్పటికే రూ.20.57 కోట్లు వసూలు

మోర్తాడ్‌: ఇంటి పన్నుల వసూళ్లలో గ్రామ పంచాయతీ ఉద్యోగులు వేగం పెంచారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి వంద శాతం పన్నుల వసూళ్ల లక్ష్యం ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు నిర్దేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.26.79 కోట్ల ఇంటి పన్నులను వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు రూ.20.57కోట్లు వసూలు చేశారు. మిగిలిన మొత్తం పక్షం రోజుల్లో పూర్తి చేస్తామని పంచాయతీ ఉద్యోగులు చెబుతున్నారు. జిల్లాలో 530 గ్రామ పంచాయతీల్లో వంద శాతం పన్నులను వసూలు చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. ఎక్కడైతే పన్నుల వసూళ్లలో వెనుకబడి ఉంటే అక్కడ స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నారు. ఏ మండలం పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు ఆ మండలంలో బృందాలుగా ఏర్పడి ఇంటి పన్నుల వసూలు కోసం ఇంటింటికి తిరుగుతున్నారు. మండల పరిషత్‌ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారుల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శుల బృందాలు స్పెషల్‌ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నాయి.



బట్టాపూర్‌లో ఇంటి పన్నులను వసూలు చేస్తున్న పంచాయతీ ఉద్యోగులు(ఫైల్‌)

వందశాతం వసూళ్లే లక్ష్యం

జిల్లాలో వంద శాతం ఇంటి పన్నుల వసూలు లక్ష్యంగా పంచాయతీ కార్యదర్శులు పని చేస్తున్నారు. ఈనెలాఖరు వరకు ప్రతి పంచాయతీలో వంద శాతం ఇంటి పన్నులను వసూలు చేస్తాం.

– తరుణ్‌, జిల్లా పంచాయతీ అధికారి

వినియోగదారుల హక్కులపై అవగాహన

తెయూ(డిచ్‌పల్లి): వినియోగదారుల సంరక్షణ కోసం కన్స్యూమర్‌ ప్రొటెక్షన్‌ యాక్ట్‌ ఉందని, ప్రతి విద్యార్థి వినియోగదారుల హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ సెక్రెటరీ పద్మావతి సూచించారు. తెలంగాణ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌–1, యూనిట్‌–4 ఆధ్వర్యంలో డిచ్‌పల్లి మండలం సాంపల్లి, సాంపల్లి తండా గ్రామాల్లో నిర్వహిస్తున్న వేసవి ప్రత్యేక శిబిరంలో శుక్రవారం పద్మావతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆమె విద్యార్థులకు కన్స్యూమర్‌ ప్రొటెక్షన్‌ యాక్ట్‌పై అవగాహన కల్పించారు. ఆమెను ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్స్‌ స్రవంతి, స్వప్న సన్మానించారు. అనంతరం సాంపల్లి ఉన్నత పాఠశాలలో డిచ్‌పల్లి ఎంపీడీవో ఆకుల రవీందర్‌ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు.



జిల్లా లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ సెక్రెటరీ పద్మావతిని సత్కరిస్తున్న ప్రోగ్రాం ఆఫీసర్లు


హక్కుల పరిరక్షణకు పాటుపడాలి

సుభాష్‌నగర్‌: వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం అంకితభావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌ సూచించారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లోని పౌర సరఫరాల శాఖ, సివిల్‌ సప్లయ్స్‌ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. వినియోగదారులను చైతన్యపర్చేందుకు వీలుగా ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుడు తన హక్కులు, బాధ్యతలను తెలుసుకున్నప్పుడే నాణ్యమైన వస్తువులు, సంతృప్తికర సేవలు పొందేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. మోసాలకు గురయితే న్యాయం పొందేందుకు చట్టాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో చంద్రప్రకాశ్‌, సివిల్‌ సప్లయ్స్‌ డీఎం జగదీశ్‌, డీఈవో దుర్గాప్రసాద్‌, డీఎంహెచ్‌వో డాక్టర్‌ సుదర్శనం, తూనికలు–కొలతల శాఖ అధికారి నిర్మల్‌ కుమార్‌, ఔషధ నియంత్రణ అధికారిణి శ్రీలత, జిల్లా వినియోగదారుల సమాఖ్య అధ్యక్షుడు రాజేశ్వర్‌, గుజ్జ రాజేశ్వరి పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌, తదితరులు

ప్రజాసమస్యలను పరిష్కరించాలి



రెంజల్‌(బోధన్‌): ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని డీపీవో తరుణ్‌ మండల కార్యదర్శులను ఆదేశించారు. రెంజల్‌, నీలా గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగిల్‌ ఫేజ్‌ మోటార్ల వద్ద ప్రజలు నీటిని వృథా చేయకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. డ్రెయినేజీలు, మురికి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, రోడ్ల పక్కన చెత్త నిల్వలను ఎత్తి వేయించాలని సూచించారు. రెంజల్‌ ఎంపీడీవో కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాపాలన కౌంటర్లను పరిశీలించారు. దరఖాస్తుదారుల అనుమానాలను నివృత్తి చేయాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగించుకునేలా పరిష్కారం అందించాలని వివరించారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్‌, సూపరింటెండెంట్‌ శ్రీనివాస్‌, కార్యదర్శులు ఉన్నారు.

వాహనదారులకు ఊరట

సుభాష్‌నగర్‌: పార్లమెంట్‌ ఎన్నికల వేళ వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పెట్రోల్‌, డీజిల్‌పై రూ.రెండు తగ్గించడంతో జిల్లా వాహనదారులపై నెలకు రూ.4.38 కోట్ల భారం తగ్గనుంది. జిల్లాలో ప్రతినెలా పెట్రోల్‌, డీజిల్‌ కలిసి 21వేల కేఎల్‌ల వినియోగం ఉంది. తగ్గింపు తర్వాత లీటర్‌ పెట్రోల్‌ రూ.108, డీజిల్‌ రూ.96గా ఉంది. చాలా రోజుల తర్వాత కేంద్రం చమురు ధరలు రూ.2 తగ్గించడంతో జిల్లాలోని వాహనదారులు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు. కాగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌ సిలిండర్‌పై రూ.100 తగ్గించిన విషయం తెలిసిందే. కాగా ధరల తగ్గింపు భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. రూ.రెండు తగ్గించడంపై పెదవి విరుస్తున్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే కేంద్రం ధరలు తగ్గించిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. తగ్గించిన పెట్రోల్‌ ధరలు శుక్రవారం ఉదయం నుంచే అమలులోకి వచ్చాయని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చంద్రప్రకాశ్‌ తెలిపారు. పెట్రోల్‌ బంకుల యజమానులు ధరలు తగ్గించి విక్రయించాలని సూచించారు. ధరలు తగ్గించకుండా విక్రయించినట్లు ఫిర్యాదు వస్తే బంకులను సీజ్‌ చేస్తామన్నారు.

క్రైం కార్నర్‌

ఆటో బోల్తా : ముగ్గురికి గాయాలు



ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మండలం చేపూర్‌ సమీపంలో జాతీయ రహదారి ఓ ఆటో బోల్తా పడి ముగ్గురు గాయపడ్డారు. నిజామాబాద్‌ నుంచి ఆర్మూర్‌ మీదుగా భీమ్‌గల్‌ వెళ్తున్న ఆటో చేపూర్‌ సమీపంలో ఓ దర్గా వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆర్మూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఓ మహిళకు తలకు తీవ్ర గాయం కావడంతో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి..



ఆర్మూర్‌టౌన్‌: మామిడిపల్లి సమీపంలో మోర్‌ సూపర్‌ మార్కెట్‌ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. ఆర్మూర్‌ నుంచి వరంగల్‌కు వెళ్తున్న పరకాల డిపోకు చెందిన బస్సు మోర్‌ సూపర్‌ మార్కెట్‌ వద్ద రోడ్డు దాటుతున్న ఓ వృద్ధుడిని ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. కండక్టర్‌, స్థానికుల సహాయంతో గాయపడిన వృద్ధుడిని ఆర్మూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తలకు తీవ్ర గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రవికుమార్‌ తెలిపారు.


ఇసుక ట్రాక్టర్‌ సీజ్‌

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఆరేపల్లి శివారులోని గోపన్‌ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం సీజ్‌ చేసినట్లు మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్‌ గౌడ్‌ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేకాట స్థావరంపై దాడి

నాగిరెడ్డిపేట: మండలంలోని చీనూర్‌ రోడ్డు సమీపంలో పోచారం ప్రధాన కాలువపై పేకాట ఆడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. పోచారం ప్రధానకాలువపై పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు సిబ్బంది దాడి చేశారని చెప్పారు. వారి నుంచి రూ.5,290 నగదు నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మొరం తరలిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీ పట్టివేత




మాక్లూర్‌: మండలంలోని కొత్తపల్లి చెరువు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లు, ఒక జేసీబీని శుక్రవారం టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు పట్టుకుని మాక్లూర్‌ పోలీసులకు అప్పగించారు. విశ్వసనీయ సమాచారంతో సీపీ ఆదేశానుసారం దాడులు చేసినట్లు టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ విష్ణుమూర్తి తెలిపారు. అనుమతులు లేకుండా మొరం తరలించారని తేలడంతో కేసులు నమోదు చేశామని ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

ఒకరి అదృశ్యం

బోధన్‌రూరల్‌: మండలంలోని పెంటకూర్దు గ్రామానికి చెందిన సంజీవ్‌(38) అదృశ్యమైనట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ శుక్రవారం తెలిపారు. సంజీవ్‌కు మతిస్థిమితం సరిగ్గా లేదన్నారు. ఈ నెల 10న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య




రజనీకాంత్‌ (ఫైల్‌)

సదాశివనగర్‌: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శెకెల్లి రజనీకాంత్‌(24) కామారెడ్డిలో ఆటో మొబైల్‌ షాప్‌ పెట్టి నష్టపోయాడు. ఇంటి నిర్మాణం, కారు కోసం తీసుకున్న అప్పులు, ప్రతి నెల ఈఎంఐలు కట్టలేక మదనపడుతుండేవాడు. అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య సౌమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

బోధన్‌రూరల్‌: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో మండలంలోని చిన్నమావంది గ్రామానికి చెందిన మల్లేశ్‌ (22) ఆత్మహ్యతకు పాల్పడినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ తెలిపారు. మల్లేశ్‌కు పది నెలల క్రితం మహారాష్ట్రకు చెందిన అమ్మాయితో వివాహం అయింది. భార్యాభర్తల మధ్య గొడవలు తలెత్తగా గ్రామపెద్దలు పలుమార్లు నచ్చచెప్పారు. ఇరువురి మధ్య సఖ్యత కుదరకపోవడంతో భార్య కొన్ని రోజుల క్రితం పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో మనస్తాపానికి గురైన మల్లేశ్‌ శుక్రవారం గ్రామ శివారులోని వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

జీవితంపై విరక్తితో..




షౌకత్‌ అలీ(ఫైల్‌)

నాగిరెడ్డిపేట: మండలంలోని పోచారం గ్రామానికి చెందిన షేక్‌ షౌకత్‌ అలీ(35) గురువారం రాత్రి తన ఇంట్లో దులానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. షౌకత్‌అలీకి భార్య షబీనాతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మూడేళ్ల క్రితం షబీనా భర్తతో గొడవపడి తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె తన ఇద్దరు పిల్లలతో కలిసి అక్కడే ఉంటుంది. భార్య, పిల్లలు తన వద్ద లేకపోవడంతో షౌకత్‌ అలీ నిత్యం బాధపడుతూ తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెందిన ఆయన ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై రాజు తెలిపారు. మృతుడి అన్న షేక్‌ మసూద్‌ అలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అనారోగ్యంతో ఒకరు..

కామారెడ్డి క్రైం: అనారోగ్య కారణాలతో రైలు కింద పడి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి– ఉప్పల్‌వాయి రైల్వే స్టేషన్‌ల మధ్య గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టాలపై మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. కామారెడ్డి రైల్వే ఎస్సై తావునాయక్‌ ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. మృతుడిని రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామానికి చెందిన కర్రెం గంగయ్య (58)గా గుర్తించారు. అనారోగ్య కారణాలతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు విచారణలో తేలిందని ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



షమియొద్దీన్‌ (ఫైల్‌)

సదాశివనగర్‌: సదాశివనగర్‌ శివారులో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. వివరాలు.. కామారెడ్డికి చెందిన సయ్యద్‌ షమియొద్దీన్‌(47), షరీఫ్‌ సదాశివనగర్‌లోని సాంచేపీర దర్గా వద్దకు వచ్చి మొక్కులు తీర్చుకుని స్కూటీపై కామారెడ్డికి తిరుగు ప్రయాణం అయ్యారు. గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వీరిని ఢీకొనడంతో గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ షమియొద్దీన్‌ మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

గాంధారి: చేపల వేటకు వెళ్లి రాంపూర్‌ గడ్డ తండాకు చెందిన రాత్లావత్‌ హరి(40) మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. హరి గురువారం రాత్రి పోతంగల్‌ శివారులోని యాతం చెరువుకు చేపల వేటకు వెళ్లాడు. చెరువులో గుంతలు ఉండడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఏటీఎం దొంగల కోసం గాలింపు

రుద్రూర్‌: రుద్రూర్‌లో ఏటీఎం చోరీకి పాల్పడ్డ దొంగలను పట్టుకునేందుకు పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారిపై చోరీ జరగడంతో పోలీసులు కేసును సవాల్‌గా తీసుకున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా దొంగల ఆచూకీ కోసం గాలించారు. చోరీకి దొంగలు వినియోగించిన వాహనం మహారాష్ట్రలో లభ్యమైనట్లు తెలిసింది.

డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో ఒకరికి జైలు

లింగంపేట: డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో శుక్రవారం ఒకరిని జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని శెట్పల్లికి చెందిన భూపాల్‌ ఇటీవల వాహనాల తనిఖీలో మద్యం తాగి వాహనాన్ని నడుపుతూ పట్టుబడ్డాడని ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. ఆయనను కోర్టులో ప్రవేశపెట్టగా రూ.500 జరిమానా, ఐదు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

18 మందికి జరిమానా

ఖలీల్‌వాడి: డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో ఎడపల్లి మండలంలోని జైతాపూర్‌కు చెందిన రవికృష్ణారెడ్డికి జడ్జి మూడు రోజులు జైలు శిక్ష వేసినట్లు ఏసీపీ నారాయణ శుక్రవారం తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన 18 మందికి ట్రాఫిక్‌ సీఐ వెంకటనారాయణ కౌన్సెలింగ్‌ నిర్వహించిన అనంతరం కోర్టులో హాజరుపర్చారు. 18 మందికి మేజిస్ట్రేట్‌ రూ.18,300 జరిమానా విధించినట్లు ఏసీపీ చెప్పారు.

ఎడపల్లి ఏడీఈ సస్పెన్షన్‌

నిజామాబాద్‌నాగారం: ఎడపల్లి ఏడీఈ, ఏఈ మధ్య గొడవపై సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనాలకు ఎన్‌పీడీసీఎల్‌ సీఎండీ వరుణ్‌రెడ్డి స్పందించారు. సీఎండీ ఆదేశాలతో ఇప్పటికే విజిలెన్సు డీఈ ప్రభాకర్‌ విచారణ చేసి నివేదికను ఎస్‌ఈ ప్రభాకర్‌కు అందజేశారు. శుక్రవారం సీఎండీ వరుణ్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్సు ద్వారా జిల్లాలోని విద్యుత్‌ అధికారులపై మండిపడ్డారు. ఎడపల్లి ఏడీఈ లక్ష్మణ్‌నాయక్‌ను సస్పెండ్‌ చేశారు. ఏఈ వైఎన్‌ ప్రసాద్‌రెడ్డిని నిర్మల్‌ జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎడపల్లి ఇన్‌చార్జి ఏడీఈగా బోధన్‌ ఏడీఈ సీసీ బెనర్జీ, ఏఈగా బోధన్‌ టౌన్‌ ఏఈ రవిచంద్రకు బాధ్యతలు అప్పగించారు.

ఇల్లు దగ్ధం



నస్రుల్లాబాద్‌: మండలంలోని నెమ్లి గ్రామానికి చెందిన బండి నాగవ్వ ఇల్లు శుక్రవారం ఉదయం కాలిపోయింది. విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందని ఆర్‌ఐ హన్మండ్లు తెలిపారు. రూ.1.20లక్షల ఆస్తి నష్టం జరిగిందన్నారు.